అన్నీ హోటళ్లు, రెస్టారెంట్లలో తాగునీటిని ఉచితంగా అందించాలి

- పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వీధి వ్యాపారులు తప్పనిసరిగా జలమండలి సరఫరా చేసే తాగునీటిని గానీ, ఆర్ఒ వాటర్, శుద్ధి చేసిన నీటిని గానీ తప్పనిసరిగా ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమీషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఒకవేళ, హోటళ్లు, రెస్టారెంట్లలో తప్పనిసరి పరిస్థితుల్లో వాటర్ బాటిళ్లను సరఫరా చేస్తే ఆయా బాటిళ్లపై ముద్రించిన గరిష్ట ధరను మాత్రమే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని అనేక హెూటళ్లు, రెస్టారెంట్లలో వేర్వేరు బ్రాండ్ల పేరుతో బాటిల్ వాటర్‌ను అత్యధిక ధరకు విక్రయిస్తున్నారని ఒక స్వచ్ఛంద సంస్థ చేసిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పందించారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

- సిసిఎల్ఎ నవీన్‌మిట్టల్‌కు విఆర్ఎ జెఎసి వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని విఆర్ఎల జెఎసి కోరింది. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయంలో సిసిఎల్ఎ, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కలిసి విఆర్ఎల పే స్కేలు, క్రమబద్ధీకరణ, పదోన్నతులు, వారసత్వ ఉద్యోగాలు, సమ్మె కాలానికి వేతనం వంటి తదితర అంశాలపైన విఆర్ఎ జెఎసి చైర్మెన్ ఎం.రాజయ్య, కో-కన్వీనర్స్ వంగూరు రాములు, కె.మాధవ్, వెంకటేష్ యాదవ్, ఎస్‌కే.రఫీ వినతి పత్రం అందజేశారు. సిసిఎల్ఎ స్పందిస్తూ విఆర్ఎల పేస్కేలు, ఇతర ముఖ్యమైన అంశాలన్నింటినీ సిఎం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల క్యాడర్ల పదోన్నతుల అంశంలో కూడా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాల జెఎసి చైర్మన్లు గైని దయాసాగర్, బెజ్జం భరత్‌కుమార్, బోయరాములు, పగిడిరాజయ్య, తౌర్రూర్ శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, డి,రాజు తదితరు పాల్గొన్నారు. వీరితోపాటు విఆర్ఎ సమస్యలను పరిష్కరించాలని ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో సీసీఎల్‌ఏను కలిసి విన్నవించారు.

మూడు బిల్లులకే ఆమోదం

- రెండు రాష్ట్రపతి సమ్మతికి
- రెండు ప్రభుత్వానికి వాపస్
- మరో మూడు పెండింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్‌లో పాసై గవర్నర్ ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపిన 10 బిల్లుల్లో మూడింటికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదం తెలిపారు. రెండు బిల్లులను రాష్ట్రపతి సమ్మతి కోసం రాష్ట్రపతి భవన్‌కు పంపారు. మరో రెండింటిని తిరిగి ప్రభుత్వానికి పంపిన గవర్నర్..రెండు బిల్లులను తనవద్దే పెండింగ్‌లో ఉంచారు. ప్రభుత్వం పంపిన బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకోవడంలేదని రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో కీలక సమాచారం బైటకు వచ్చింది.

ప్రభుత్వం పంపిన బిల్లుల్లో తెలంగాణ మోటర్ వెహికిల్స్ ట్యాక్సేషన్ అమెండమెంట్ బిల్ 2022, మున్సిపాలిటీస్ అమెండమెంట్ బిల్ 2023, ప్రొ.జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ అమెండమెంట్ బిల్ 2023కు గవర్నర్ ఆమోదం తెలిపారు.

తెలంగాణ ఫారెస్ట్ యూనివర్సిటీ బిల్ 2022, యూనివర్సిటీస్ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ బిల్ 2022లను రాష్ట్రపతి సమ్మతి కోసం గవర్నర్ రాష్ట్రపతి భవన్‌కు నివేదించారు.

తెలంగాణ స్టేట్ ప్రైవేట్ యూనివర్సిటీస్ అమెండమెంట్ బిల్ 2022, తెలంగాణ మున్సిపల్ లా అమెండమెంట్ బిల్ 2022, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ అమెండమెంట్ బిల్ 2022పై గవర్నర్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. తెలంగాణ పంచాయతీరాజ్ అమెండమెంట్ బిల్ 2023, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా అమెండమెంట్ బిల్ 2022పై వివరణ కోరుతూ గవర్నర్ ఈ రెండు బిల్లులను ప్రభుత్వానికి వాపస్ పంపారు.

ఫూలే ఆశయాలు స్ఫూర్తిదాయకం

- సిఎం కెసిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

మనుషులంతా అన్ని రంగాల్లో సమానత్వంతో జీవించాలనే ఆకాంక్షతో ఆధిపత్య వ్యతిరేక పోరాటం కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్ప భారతీయ సామాజిక తత్వవేత్త, మహాత్మా జ్యోతిరావు గోవిందరావు ఫూలే అని సిఎం కెసిఆర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకమేనని తెలిపారు. ఫూలే 197వ జయంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలు, త్యాగాలను సిఎం స్మరించుకున్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్ణ, లింగ వివక్షకు వ్యతిరేకంగా, దళిత, గిరిజన, బహుజన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఫూలే 200 ఏండ్ల క్రితమే కార్యాచరణ చేపట్టారని సిఎం గుర్తుచేశారు. ఆయన అనుసరించిన సామాజిక సమానత్వ పంథా, నాటి భారతీయ సమాజంలో కొనసాగుతున్న సాంప్రదాయ సామాజిక విలువలను, వ్యవస్థలను సమూలంగా మార్చివేసేందుకు బాటలు వేసిందని తెలిపారు. గుణాత్మక మార్పు దిశగా దేశంలోని స్త్రీలు, దళిత బహుజనులు ఉద్యమించేలా ఫూలే కార్యాచరణ పురికొల్పిందని పేర్కొన్నారు. ఫూలేను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వయంగా తన గురువుగా ప్రకటించుకున్నారని కెసిఆర్ గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం తన ప్రాధాన్యతా క్రమాన్ని రూపొందించుకుని అభివృద్ధి, సంక్షేమ కార్యాచరణను అమలు చేస్తున్నదని తెలిపారు. జ్యోతిబాఫూలే అందించిన స్ఫూర్తితో 'వికాసమే వివక్షకు విరుగుడు' అనే విధానాన్ని అనుసరిస్తూ తమ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం పాటుపడుతున్నదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నేడు తెలంగాణలోని మహిళా, దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, విద్యాపరంగా మెరుగైన ఫలితాలు సాధించి సామాజిక సమానత్వ దిశగా పురోగమించాయని పేర్కొన్నారు. అణగారిన వర్గాలు, బహుజనుల సమగ్ర వికాసానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు వారి సామాజిక, ఆర్థిక ఆత్మగౌరవాలను ద్విగుణీకృతం చేస్తున్నాయని వివరించారు. తమ ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి వెనుక మహాత్మాఫూలే ఆదర్శాలు, ఆశయ సాధన లక్ష్యాలు ఇమిడి ఉన్నాయని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం పనుల పరిశీలన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే అతిపెద్ద 125 అడుగుల విగ్రహాన్ని హుస్సేన్‌సాగర్ తీరంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన విషయం తెలిసిందే. ఈ నెల 14న ముఖ్యమంత్రి కెసిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సిఎస్ శాంతికుమారి, డిజిపి అంజనీకుమార్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ సోమవారం పరిశీలించారు. విగ్రహావిష్కరణకు కేవలం నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రితోపాటు వివిఐపిలు పాల్గొనే విగ్రహావిష్కరణకు ఉపయోగించే కర్టెన్, సందర్శకులకు ప్రవేశం, బహిరంగసభ నిర్వహణ స్థలం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మంత్రులు సమీక్షించారు. ఐమాక్స్ పక్కనే ఉన్న మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సభకు దాదాపు 40 వేలకుపైగా కుర్చీలు వేయించాలని ఆదేశించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్, విగ్రహావిష్కరణ అనంతరం, అంబేద్కర్ విగ్రహాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు సందర్శించనున్న నేపథ్యంలో క్యూలైన్లు, పూలు ఏర్పాటు చేయాలని కోరారు. నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, ఎస్‌సి డెవలప్మెంట్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ అమోయ్‌కుమార్, ఎస్‌పి డెవలప్‌మెంట్ శాఖ కమిషనర్ యోగితా రానా, మల్లేపల్లి లక్ష్మయ్య ఆర్అండ్‌బి అధికారులు పరిశీలించారు. కాగా, విగ్రహ ఆవిష్కరణకు సంబంధించి తుది మెరుగులు దిద్దుతుండటం గమనార్హం.

ఉద్యోగాల కోసం పోరాటం

- రాజకీయాలకతీతంగా ఆందోళనలు
- అఖిలపక్ష సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నిరుద్యోగుల కోసం రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడిందని అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సోమవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వైఎస్‌ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. నిరుద్యోగుల తరుపున వారికి ఉద్యోగాలివ్వాలనే డిమాండ్‌పై పోరాడటం రాజకీయ పార్టీగా తమ నైతిక బాధ్యతని చెప్పారు. ఈ నేపథ్యంలోనే టీ సేవ్ ఫోరాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్, హాస్టళ్లలోని వసతులు తదితర సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 3.85లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆమె ఈ సందర్భంగా చెప్పారు. బిస్వాల్ కమిటీ రాష్ట్రంలో 1.91లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో నిరుద్యోగుల సమస్యలపై ఈ నెల 17న 48గంటల నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. కేంద్రం ప్రభుత్వం ఇస్తామని చెప్పిన రెండు కోట్ల ఉద్యోగాల విషయంలో బిజెపి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం వేదిక ఏదైనా కలిసి కట్టుగా కార్యాచరణ ప్రకటించాలన్నారు.

బిఆర్ఎస్ నుంచి పొంగులేటి, జూపల్లి బహిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బహిష్కరణకు గురయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కారణంగా జూపల్లి, పొంగులేటిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలంగాణ భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
E.A.No.446/2019 E.P.No.137/2004
O.S.No.42/2002 in A.S.No.96/2019
Between:
N.Ramana nanda Reddy ...Appellant/D.Hr
And
N.Srenivasulu ...Claimant/J.Drs
N.Harinath (J.Dr-1)
Notice to J.Dr No.1
J.Dr No:1
N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.
పై నెంబరు కేసులో జె.డిఆర్-1 అయిన మీ హాజరు నిమిత్తం 18-04-2023 వ తేది ఉదయం 10.30 గంllలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
E.A.No.447/2019 E.P.No.139/2004
O.S.No.45/2002 in A.S.No.97/2019
Between:
N.Sapthagiri Reddy ...Appellant/D.Hr
And
N.Srenivasulu ...Claimant/J.Drs
N.Harinath (J.Dr-1)
Notice to J.Dr No.1
J.Dr No:1
N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.
పై నెంబరు కేసులో జె.డిఆర్-1 అయిన మీ హాజరు నిమిత్తం 18-04-2023 వ తేది ఉదయం 10.30 గంllలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
E.A.No.448/2019 E.P.No.135/2004
O.S.No.40/2002 in A.S.No.98/2019
Between:
N.Prakash Reddy died by L.Rs. N.Prahallada Reddy ...Appellant/D.Hr
And
N.Srenivasulu ...Claimant/J.Drs
N.Harinath (J.Dr-1)
Notice to J.Dr No.1
J.Dr No:1
N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.
పై నెంబరు కేసులో జె.డిఆర్-1 అయిన మీ హాజరు నిమిత్తం 18-04-2023 వ తేది ఉదయం 10.30 గంllలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
E.A.No.451/2019 E.P.No.138/2004
O.S.No.43/2002 in A.S.No.100/2019
Between:
N.Yerrappa Reddy ...Appellant/D.Hr
And
N.Srenivasulu ...Claimant/J.Drs
N.Harinath (J.Dr-1)
Notice to J.Dr No.1
J.Dr No:1
N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.
పై నెంబరు కేసులో జె.డిఆర్-1 అయిన మీ హాజరు నిమిత్తం 18-04-2023 వ తేది ఉదయం 10.30 గంllలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
E.A.No.449/2019 E.P.No.136/2004
O.S.No.41/2002 in A.S.No.101/2019
Between:
N.Sapthagiri Reddy ...Appellant/D.Hr
And
N.Srenivasulu ...Claimant/J.Drs
N.Harinath (J.Dr-1)
Notice to J.Dr No.1
J.Dr No:1
N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.
పై నెంబరు కేసులో జె.డిఆర్-1 అయిన మీ హాజరు నిమిత్తం 18-04-2023 వ తేది ఉదయం 10.30 గంllలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

నేటితో పది ప్రధాన పరీక్షలు పూర్తి

- సైన్స్‌కు 99.61 శాతం హాజరు
- ఏడుగురిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి ప్రధాన పరీక్షలు మంగళవారం సోషల్ స్టడీస్ సబ్జెక్టుతో పూర్తి కానున్నాయి. ఈనెల మూడో తేదీ నుంచి ఈ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదటి రోజే ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష ప్రారంభమైన ఏడు నిమిషాలకే అంటే ఉదయం 9.37 గంటలకు ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో బయటకొచ్చింది. రెండోరోజు హిందీ ప్రశ్నాపత్రం కూడా వాట్సాప్ ద్వారా బయటకొచ్చింది. దీంతో పరీక్షల నిర్వహణ, ప్రభుత్వ నిర్లక్ష్యం, పాఠశాల విద్యాశాఖ అధికారుల అలసత్వంపై పెద్దఎత్తున విమర్శలు తలెత్తాయి. మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ ప్రశ్నాపత్రం బయటకు వెళ్లడానికి కారణమైన బందెప్ప, సమ్మప్పను ఉద్యోగం నుంచి ప్రభుత్వం తొలగించింది. రెండోరోజు హిందీ ప్రశ్నాపత్రం బయటకెళ్లిన ఘటనలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై పోలీసులు ఏ1 ముద్దాయిగా కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్) పరీక్ష నుంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మంగళవారం నిర్వహించిన సైన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 4,86,829 మంది దరఖాస్తు చేసుకుంటే, 4,84,921 (99.61 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 1,908 (0.39 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. ప్రయివేటు విద్యార్థుల్లో 4,589 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 3,778 (82.33 శాతం) మంది పరీక్ష రాశారని తెలిపారు. 811 (17.67 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. నిజామాబాద్‌లో ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశామని, హన్మకొండలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించామని పేర్కొన్నారు.

కోర్టుల్లో కేసులు వేస్తే తప్ప పాస్ కాని బిల్లులు

- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న గవర్నర్
- నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లోనే..
- గవర్నర్‌పై మంత్రి హరీశ్‌రావు విమర్శలు
- మూడు బిల్లులు పాస్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోర్టులో కేసులు వేస్తే తప్పా బిల్లులు పాస్ కాని దుస్థితి నెలకొందని, రాష్ట్ర అభివృద్ధిని గవర్నర్ అడ్డుకుంటున్నారని, బిల్లులు పాస్ చేయకుండా పెండింగ్‌లో పెడుతున్నారని మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాలుగు జిల్లాలకు తాగు నీరందించే ట్రయల్ రన్ నిర్వహణలో భాగంగా సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం మంగోల్‌లో నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రం స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను రాజకీయంగా వాడుకుంటున్నదని విమర్శించారు. అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను గవర్నర్ అమోదించకుండా ఏడు నెలలుగా పెండింగ్‌లో పెట్టారన్నారు. దీని వెనుక రాజకీయం ఏంటనేది అందరికి తెలుసని.. కోర్టులకు వెళ్లి కేసులు వేస్తే తప్ప బిల్లులు పాస్ కానీ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు వేస్తే ఈ రోజు రెండు, మూడు బిల్లులు పాస్ చేశారని.. రాష్ట్ర ప్రగతిని బిజెపి అడ్డుకునేందుకు ఎన్ని కుట్రలు చేస్తోందో దీన్ని బట్టే అర్థమవుతోందన్నారు. దేశంలో తొలిసారిగా ఫారెస్ట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఆ బిల్లును అడ్డుకుని, రాష్ట్రపతి పరిశీలనకు పంపారన్నారు. ఇది రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవడం కాదా అని ప్రశ్నించారు. అలాగే కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఉద్యోగాలు ఇస్తామంటే.. ఏడు నెలలు ఆపి ఇప్పుడు రాష్ట్రపతి పరిశీలనకు పంపడం ఏంటని ప్రశ్నించారు. ఇక్కడి పిల్లలకు చదువులు చెప్పే ప్రొఫెసర్లు వద్దా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని యూనివర్సిటీలకు కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బీహార్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో 1961 నుంచే ఉందని.. ఇక్కడ మాత్రం ఇలా చేయడం సబబేనా అన్నారు. గవర్నర్ రాష్ట్ర ప్రగతికి సహకరించడం మాని మోకాళ్లడ్డు పెట్టడం సరికాదన్నారు. తెలంగాణ ప్రజలు సరైన సమయంలో కేంద్రానికి తగిన గుణపాఠం చెబుతారని స్పష్టంచేశారు. కాగా, మూడు బిల్లులను ఆమోదించడం పట్ల గవర్నర్‌కు మంత్రులు ధన్యవాదాలు తెలిపారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

IN THE COURT OF X ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE (COMMERCIAL COURT), BENGALURU RURAL COURT AT BENGALURU
COMMERCIAL O.S. 1045/2021
Plaintiff : M/s. Graintec Industries, R/o. Survey No.101, Kachohalli, Lakshmipura Post, Dasanapura Hobli, Bengaluru - 560 091. Represented by its Managing Partner, Mr. K. R. Prasanna Kumar,
V/s.
Defendant :
1. M/s. Chandana Rice Industries
2. Raini Srinivas 3. Pushpalatha Rayini
4. Ramesh Soma 5. M R Uma Priya Taneru
6. Dhanalazmi Karati 7. Jyothi Perumalla
8. Venkata Pardha Sai Teja Perumulla
9. Anusha Rayini 10. Shushma Karnati
11. Govardhan Alampalli
12. Madhavilatha Alampalli
13. Laxmi Maddi 14. Ramaswami Kola
15. qqsa. Sunitha Edukulla
SUMMONS TO THE DEFENDANT
To, **9. Anusha Rayini,** Major, Partner or M/s. Chandana Rice Industries, R/o. 4-141, Kalaiwada, Guntur Road, Miryalaguda, Nalgonda, Telangana.
10. Shushma Karnati, Major, Partner of M/s. Chandana Rice Industries, 1-2-205/KK Road, Suryapet, Telangana.
Whereas, the above named Plaintiff instituted a suit against you and the Defendants for recovery of Rs. 1,40,26,127/- (Rupees One Crore Forty Lakhs twenty Six Thousand One Hundred and Twenty Seven Only) with interest from the date of the suit till realization.
You are hereby summoned to appear before this court **on 17.4.2023 at 11 a.m.** in person or through advocate / pleader to answer the claim. Falling which the suit will be heard and determined as ex-parte.
Given under my hand and seal of the court, this 23rd day of March 2023.
By order of the Court, Sheristedar, X Addl. District & Sessions Court, Bengaluru Rural District, Bengaluru.
Address of the Advocate for Plaintiff :
Sateesh Chandra KV & Associates
Advocates and Consultants
S-309, South Block, Manipal Centre, Off to M G Road, Bengaluru - 560 042.

హెచ్‌యుజె ఆధ్వర్యంలో కంటి వెలుగు

క్యాంపును సందర్శించిన డిఎంహెచ్ఒ వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (హెచ్‌యూజే - టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఎంహెచ్ భవన్‌లో ఎంవిఎన్‌ఆర్ మెమోరియల్ హాస్పిటల్‌లో కంటిపరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకున్నారు. దగ్గరి చూపులో స్వల్ప లోపం ఉన్న జర్నలిస్టులకు అక్కడే రీడింగ్ గ్లాసెస్ అందించారు. కంటిచూపు సమస్య ఎక్కువగా ఉన్న మరికొంత మందికి మూడు వారాల్లో కండ్లద్దాలు అందజేస్తామని అధికారులు తెలిపారు.

కాగా, కంటి వెలుగు శిబిరాన్ని డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ వెంకట్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ పద్మజ, కంటి వెలుగు ప్రోగ్రామ్ ఆఫీసర్ అశ్మిత తదితరులు సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రిస్కిప్షన్ గ్లాసెస్‌ను మూడు వారాల్లో అందిస్తామని డా. వెంకట్ తెలిపారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు ద్వారా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం, అద్దాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ రామలక్ష్మి, డాక్టర్ శ్రీధర్, హెచ్‌యుజె వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగవాణి, హెచ్‌యుజె ఆఫీస్ బేరర్లు, రాష్ట్ర అధ్యక్షులు పిల్లి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు ఆనందం, బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, సెక్రటరీ చంద్రశేఖర్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ సిహెచ్ మధుకర్, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సిఐటియు కార్యాలయంలో విమలా రణదివె జయంతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధురాలు, ట్రేడ్ యూనియన్ నేత విమలా రణదివె 108వ జయంతిని సోమవారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విమలా రణదివె చిత్ర పటానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమంలో ఆమె కీలకపాత్ర పోషించిన విషయాన్ని గుర్తుచేశారు. సమాజంలో దోపిడీ పోవాలంటే వర్గపోరాటం తప్ప మరొకటి లేదని చెప్పి కార్మిక పోరాటాన్ని ఉధృతం చేసిన మహనీయురాలని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్వదేశీ జపం చేస్తూ మన దేశాన్ని విదేశీ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, మతోన్మాద శక్తులకు కట్టబెడుతున్నదని విమర్శించారు. పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యం మనుగడకే ప్రమాదం ముంచుకొచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలను, రైతాంగాన్ని, పేద ప్రజలను సమీకరించి ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేయడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ మాట్లాడుతూ.. విమలా రణదివె 12వ ఏటనే దేశ స్వాతంత్రం కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్నదనీ, ఆరు నెలలు జైలు శిక్షను కూడా అనుభవించారని గుర్తుచేశారు. శ్రామిక మహిళల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహించడమే కాదు, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ఆమె చేసిన కృషి మరువలేనిదన్నారు. వాయిస్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్ పత్రిక ఎడిటర్‌గా, అంగన్‌వాడీ వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. మహిళలను పోరాటాలలో భాగస్వామ్యం చేయకుండా దేశం విముక్తి కాదని నొక్కి చెప్పారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కార్యదర్శి పి శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు వై సోమన్న, పి సుధాకర్, ఎ సునీత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విమలా రణదివె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

IN THE COURT OF THE PRINCIPAL FAMILY JUDGE CUM IV ADDITIONAL DISTRICT JUDGE AT VIJAYAWADA
H.M.O.P. No. 704/2022
Between:
Lakkoju Naga Durga Harika @ Maroju Naga Durga Harika .... Petitioner
AND
1. Lakkoju Phanindra Babu
2. Ankoju Anitha .... Respondents
Respondent No.2
Ankoju Anitha, R/o. House No.4-12-918, N.P. Auto Sai Nagar, Bagh Hayath Nagar, Vanasthalipuram, K.V. Ranga Reddy District. HYDERABAD-500 070.
పై నెంబరు వైవాహిక ఓ.పి.ని, పిటిషనరు రెస్పాండెంట్ నెం.1 ఆండ్ 2లపై [illegible] దాఖలు చేయగా, [illegible] తేదీకి [illegible] వాయిదా వేసినారు. [illegible]
వాయిదా: 02-05-2023
/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///
వి. శ్యామసుందర్ రెడ్డి,
పిటిషనరు తరుపు న్యాయవాది,
గాంధీనగర్, విజయవాడ-520003

హైదరాబాద్‌లో 'డిఎస్ఎం' తయారీ కేంద్రం ఏర్పాటు

హైదరాబాద్ : ఆరోగ్య, పౌష్టికాహారం ఉత్పత్తులను అందించే రాయల్ డిఎస్ఎం హైదారాబాద్‌లో తన నూతన ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. దేశ వ్యాప్తంగా పౌష్టికాహార అవసరాలను తీర్చేందుకు ఈ కేంద్రం మద్దతు చేయనుందని తెలిపింది. ఇది వినూత్న తరహా వాణిజ్య తయారీ కేంద్రమని పేర్కొంది. అత్యున్నత నాణ్యత కలిగిన ఉత్పత్తి ప్రక్రియలను వినియోగించుకుని న్యూట్రిషినల్లీ ఫోర్టిఫైడ్ (పోషక విలువలతో కూడిన) బియ్యం గింజలను ఉత్పత్తి చేస్తుందని తెలిపింది. సంవత్సరానికి 3600 టన్నుల కెర్నల్స్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది.

సిద్స్‌ఫార్మ్ నుంచి మజ్జిగ

హైదరాబాద్ : తెలంగాణా కేంద్రంగా పని చేస్తున్న ప్రీమియం డైరెక్ట్ టు కన్స్యూమర్ (డి2సి) డెయిరీ బ్రాండ్ సిద్స్ ఫార్మ్ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్తగా మజ్జిగను ఆవిష్కరించినట్లు తెలిపింది. 200 మిల్లీలీటర్ల కప్పు ధరను రూ.20గా నిర్ణయించినట్లు పేర్కొంది. హైదరాబాద్, బెంగళూరు మార్కెట్‌లో ఇది లభ్యమవుతుందని తెలిపింది.

విశిష్ట కళాకారుడు వైకె నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కల్చరల్.

యువ కళా వాహిని సాంస్కృతిక సంస్థను స్థాపించి కళాకారులను సాహితీ వేత్తలకు వేదిక కల్పించిన వైకె నాగేశ్వరరావు నాటక రంగంలో విశిష్ట కళాకారుడు అని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ నివాళులు అర్పించారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై యువ కళా వాహిని సాంస్కృతిక సంస్థ నిర్వహణలో కళా పోషకుడు సారి పల్లి కొండలరావు సారథ్యంలో వైకె నాగేశ్వరరావు ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని రంగ స్థల ప్రముఖులకు పురాస్కర ప్రదానోత్సవం సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని మాట్లాడుతూ చరిత్ర ప్రసిద్ధులైన నేతాజీ, రాణా ప్రతాప్ వంటి చరిత్రాత్మక నాటకాలలో ప్రధాన పాత్ర పోషించి నాగేశ్వరరావు చివరి వరకూ కళా రంగానికె అంకితమయ్యారని వివరించారు. అధ్యక్షత వహించిన కళా పోషకుడు సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ సాంస్కృతిక రంగంలో నాగేశ్వరరావు లేని లోటు తీర్చలేనిది అని ఆవేదన వ్యక్తం చేశారు. నాగేశ్వరరావు తో సాహితీ వేత్తలు వోలేటి పార్వతీశం, డాక్టర్ కెవి కష్ణ కుమారి తమకున్న అనుబంధం గుర్తుకుతెచ్చుకున్నారు. అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ, డిఎస్ ఎన్మూర్తి, అక్కిరాజు సుందర రామకృష్ణ, కాళిదాసు, కల్యాణి, మంచాల రమేష్, సుబ్బరాజులకు అతిథులు పురస్కరాలు బహు కరించారు. నటుడు సుబ్బరాయశర్మ, జర్నలిస్ట్ ఎస్‌వి రామారావులు పాల్గొన్న సభకు సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ స్వాగతం పలుకుతూ నాగేశ్వరరావు నిర్వహణ దక్షతను కొని యాడుతూ ఆయన స్థానంలో తాను అధ్యక్షుని గా బాధ్యత తీసుకోన్నానని బాధా తప్త హృదయం చెప్పారు.

భాగి శాస్త్రి, రాజ్ కుమార్ నిర్వహణలో దీపికా ప్రసాద్ రచించి దర్శకత్వం వహించిన కాళ హస్తీశ్వరసాయుజ్యం పద్య నాటకం ప్రదర్శించారు.

రూ.900 కోట్లతో ఎక్సాన్‌మొబిల్ ప్లాంట్

న్యూఢిల్లీ : భారత్‌లో లూబ్రికెంట్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నామని ఎక్సాన్‌మొబిల్ వెల్లడించింది. లూబ్రికేషన్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్ అయిన ఎక్సాన్ మొబిల్ మహారాష్ట్రలోని రాయ్‌గడ్‌లో రూ.900 కోట్ల పెట్టుబడితో దీన్ని నిర్మించనున్నట్లు ప్రకటించింది. దేశంలో పెరుగుతోన్న చమురు డిమాండ్‌ను తీర్చేందుకు ఏడాదికి 1,59,000 కిలోలీటర్ల ఫినిష్డ్ లూబ్రికెంట్‌ల సామర్థ్యంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొంది. 2025 చివరి నాటికి వాణిజ్య పరంగా ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు తెలిపింది.



ఇండ్కల్ నుంచి ఏసర్ లార్జ్ అప్లయిన్సెస్

న్యూఢిల్లీ : బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న ఇండ్కల్ కొత్తగా ఏసర్ లార్జ్ బ్రాండ్‌పై ప్రీమియం ఎయిర్ కండీషనర్లు, వాషింగ్ మిషన్లను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఏసర్ లార్జ్ పేరుతో తన డబ్ల్యు సీరిస్‌లో క్యూఎల్ఇడి స్మార్ట్ టివిలను కూడా విడుదల చేసినట్లు పేర్కొంది. 65, 75 అంగుళాల పరిమాణంలో వీటిని ఆవిష్కరించినట్లు ఏసర్ ఇన్‌కార్పొరేటెడ్ వైస్ ప్రెసిడెంట్ జాడే జౌ తెలిపారు. ఎసి ధరలు రూ.27,999 నుంచి, ప్రీమియం వాషింగ్ మిషన్ల ధరలు రూ.13,499 నుంచి ప్రారంభమవుతాయని ఆ సంస్థ తెలిపింది.

గూగుల్ పే రివార్డ్స్‌లో రూ.80,000..!

వాషింగ్టన్ : నగదు చెల్లింపుల యాప్ గూగుల్ పేలో స్క్రాచ్ చేసిన కొందరికి రూ.80,000 (దాదాపు వెయ్యి డాలర్లు) వరకు ఖాతాల్లో జమ అయ్యాయి. గూగుల్ పేలో చిన్నపాటి టెక్నికల్ సమస్య వల్ల అమెరికాలోని పలువురు ఖాతాదారులు ఈ బంఫర్ ఆఫర్‌ను కొట్టేశారు. కొద్దిమంది పిక్సల్ ఫోన్ యూజర్లు స్క్రాచ్ కార్డులతో రూ.800 నుంచి రూ.80వేల వరకు తమ ఖాతాల్లోకి వచ్చాయి. సోషల్ మీడియాలో ఈ విషయం దహనంలా వ్యాపించింది. సాంకేతిక లోపం వల్ల అలా జరిగిందని.. క్యాష్ బ్యాక్ అందుకున్న ఖాతాదారుల నుంచి రికవరీ చేస్తున్నామని ఆ సంస్థ తెలిపింది.

పంచాయతీ కార్మికులకు జీతాలెందుకు పెంచరు?

- 50 వేల మంది కార్మికుల గోస పట్టదా: పాలడుగు భాస్కర్
- పంచాయతీరాజ్ కమిషనరేట్ ఎదుట జెఎసి ధర్నా
- డిప్యూటీ కమిషనర్ రామారావుకు వినతి

ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు పెంచినట్టుగా పంచాయతీ కార్మికులకు జీతాలెందుకు పెంచరని గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మెన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 50 వేల మంది కార్మికుల గోస పట్టదా? అని నిలదీశారు. వారి సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలనీ, పని భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనరేట్ ఎదుట కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నానుద్దేశించి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ..పంచాయతీల్లో పనిచేస్తున్న సుమారు 50వేల మంది కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తున్నదని విమర్శించారు. మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పనిభారం పెంచి వేతనాలు పెంచకపోవటంతో కార్మికులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మానసికంగా అలసిపోయి అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.15,600 వేతనం చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఒకే విధమైన పనిచేస్తున్న పంచాయితీ కార్మికుల పట్ల ఎందుకు వివక్ష ప్రదర్శిస్తుందని ప్రశ్నించారు. గ్రామపంచాయితీ సిబ్బందికి స్కిల్డ్, సెమీ, అన్‌స్కిల్డ్ కేటగిరీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అందర్నీ పర్మినెంట్ చేయాలని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా పంచాయతీ అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని నియమించుకోవాలనీ, మల్టీపర్పస్ పని విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన కారోబార్, బిల్ కలెక్టర్లకు పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. ఎస్‌కేడే ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని విన్నవించారు. సహజ మరణానికి రూ. ఐదు లక్షలు, ప్రమాదవ శాత్తు మరణిస్తే రూ. పది లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవులు, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఎసి నేతలు నర్సింహ్మారెడ్డి, జయచంద్ర, వెంకటరాజం, శివశంకర్, మల్లయ్య, యజ్ఞనారాయణ, సదానందం, పాలడుగు సుధాకర్, వెంకటయ్య సూర్యం, సాంబశివరావు, శివబాబు, దాసు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ కాదు.. మాల్ ప్రాక్టీస్

- కుట్రపూరితంగా కేసుల నమోదు
- ఎమ్మెల్యే ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి పేపర్ లీకేజీ కాలేదని, మాల్ ప్రాక్టీస్ జరిగిందని బిజెపి జాతీయ కార్యవర్గసభ్యులు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. వరంగల్ పోలీసు కమిషనర్ కార్యాలయానికి సోమవారం మధ్యాహ్నం ఆయన వచ్చి విచారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంటపాటు ఈటల రాజేందర్‌ను పోలీసు అధికారులు ప్రశ్నించారు. విచారణ అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. ప్రగతిభవన్‌లో అధికారాలను అడ్డుపెట్టుకొని కుట్ర పూరితంగా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కెసిఆర్‌ను అధికారం నుంచి దించేంత వరకు ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. 30 లక్షల మంది యువతీయువకులు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, నాలుగు పరీక్షా పత్రాలు లీకైనట్టు దర్యాప్తులో తేలిందని, వారి జీవితాలతో సిఎం ఆటలాడుతున్నారని విమర్శించారు. ఉదయం 9.30 గంటలకు పదో తరగతి పరీక్ష ప్రారంభమై 11.00 గంటల తరువాత పేపర్ బయటకు వస్తే అది లీకేజీ కాదని, కేవలం ఆ పరీక్షా కేంద్రంలో జరిగిన మాస్ కాపీయింగ్ మాత్రమేనన్నారు. టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీపై సర్వత్రా చర్చ జరుగుతుండటంతో దాన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. లిక్కర్ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆదేశాల మేరకు రేంజ్ రోవర్ కారులో కోట్లాది రూపాయలను సిఎం కెసిఆర్‌కు ఇచ్చానని చెబుతున్న క్రమంలో దానిపై చర్చ జరగకుండా పక్కదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దేశంలో ఎన్నికలకయ్యే ఖర్చు మొత్తం ఇస్తానని తనను చైర్మెన్‌గా ప్రకటించాలని ఆయన చెప్పినట్టు రాజ్ సర్‌దేశాయ్ చెప్పిన విషయంపై చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. దేశంలో అత్యధిక ధనికుడు కెసిఆరేనని, అత్యంత ధనిక పార్టీ కూడా బిఆర్ఎస్ అని చెప్పారు. 40-50 ఏళ్లుగా ఇచ్చిన అసైన్డ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం లాక్కొని రియల్ ఎస్టేట్ చేస్తున్నారన్నారు. తన నియోజకవర్గం నుంచి ఓ కార్యకర్త మెసేజ్ పంపారని, తాను ఆ మెసేజ్‌ని ఓపెన్ చేయలేదని, తాను బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధినని, తనకు ప్రశాంత్ నుంచి ఎలాంటి మెసేజ్ రాలేదని స్పష్టం చేసినట్టు చెప్పారు. తన సెల్‌ఫోన్‌ను డిసిపి సమక్షంలోనే తనిఖీ చేశారన్నారు. ఆయన వెంట హన్మకొండ బిజెపి అధ్యక్షులు రావు పద్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎం ధర్మారావు, కొండేటి శ్రీధర్, తదితరులున్నారు.

ఆక్వా హబ్‌లో స్థానికులకు ఉపాధి

- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెల్లారిలేస్తే మసీదులు తవ్వుదామా.. పేపర్ లీక్ చేద్దామా అనే వారికి ఓటు వేయొద్దని.. ఈ సారైనా మంచి వారిని కరీంనగర్ ఎంపీగా గెలిపించుకోవాలని మంత్రి కెటిఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో సోమవారం మంత్రి విస్తృత పర్యటన చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు, మహనీయుల విగ్రహావిష్కరణలు చేశారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఎస్‌సి, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. బిఆర్.అంబేద్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటి వరకు రూ.12కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముంపు ప్లాట్‌లకు డబ్బులు రాని వారు, 18 సంవత్సరాలు నిండి డబ్బులు రాని వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. 350 ఎకరాల్లో ఆక్వా హబ్ ఏర్పాటు చేయనున్నామని, స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మండల కేంద్రంలో త్వరలోనే రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తుందని చెబుతూ.. 'ఎంపీ సక్కటోడు లేడుగనీ.. వినోద్‌కుమార్ లాంటి ఎంపి ఉంటే ఈపాటికే రైలు కూడా వస్తుండే' అన్నారు. ఎంపీకి 'తెల్లారిలేస్తే లొల్లి.. ఒకటే మతం పంచాయితీ, మసీదులు తవ్వుదామా.. ఏడ పేపర్ లీక్‌లు చేద్దామా.. ఈ లొల్లి తప్ప అసలు లొల్లిలు లేవని' ఆరోపించారు. కాబట్టి ఈ సారైనా ఆలోచించి ఎంపిగా వినోద్‌కుమార్ లాంటి మంచోనికి ఓటేసి గెలిపించుకోవాలని కోరారు.

నేటినుంచి ఎఐకెఎస్ ఆవిర్భావ దినోత్సవాలు

- 13 వరకు జరపాలని తెలంగాణ రైతుసంఘం పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నుంచి ఈ నెల 13 వరకు గ్రామాల్లో సభలు, ప్రదర్శనలను జరిపి సంఘం జెండావిష్కరణలు చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఎఐకెఎస్ ఆవిర్భావ దినోత్సవం పోస్టర్లను తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహ్మారెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు ఆర్ రాహుల్, ఆర్ ఆంజనేయులులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ దున్నేవాడికే భూమి, ఆంగ్లేయులు భారతదేశాన్ని విడిచి వెళ్లాలనే నినాదంతో 1936, ఏప్రిల్ 11న స్వాతంత్రోద్యమంలో భాగంగా ఎఐకెఎస్ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర గ్రామీణ పేదల్ని సంఘటిత పరిచిందన్నారు. భూస్వామ్య విధానాన్ని సమూలంగా రద్దు చేయడం, పేద రైతులు, వ్యవసాయ కార్మికుల ఐక్యత పునాదిగా రైతాంగాన్ని ఏకం చేసిందని చెప్పారు. రైతు సమస్యలపై ఆందోళనలు నిర్వహించడంతోపాటు ఇతర వర్గాల పోరాటాలకు సంఘీభావం తెలిపిందని అన్నారు. మార్కెట్ గుత్తాధిపత్యంతో సాగే దోపిడీని ఎదిరించిందని వివరించారు. వ్యవసాయంలో విదేశీ కంపెనీల చొరబాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. వడ్డీ ప్రమాణాల మెరుగుదల కోసం, గ్రామీణ ప్రజల సాంస్కృతిక అభివృద్ధి కోసం పాటుపడుతుందని అన్నారు. సంఘం నాయకత్వాన వర్లీ ఆదివాసుల పోరాటం, తెభాగ పోరాటం, పున్నప్రావాయలార్, గణముక్తి పోరాటాలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగాయని గుర్తు చేశారు. భూ సంస్కరణలను అమలు జరపాలంటూ సాగిన పోరాటంతో 1968లో మొదటిసారి, 1973లో రెండోసారి అవి అమలయ్యాయని చెప్పారు. ఫలితంగా 64.96 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని 54.02 లక్షల ఎకరాలను దేశవ్యాప్తంగా జపంపిణీ చేశారని వివరించారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను ఢిల్లీలో రైతాంగ పోరాట ఫలితంగా కేంద్రం ఉపసంహరించుకున్నదని అన్నారు. కేంద్రం ఇచ్చిన హామీల అమలు, కనీస మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని రైతాంగానికి ఆయన పిలుపునిచ్చారు.

మిగిలిన రైతులకు తక్షణమే రైతుబంధు విడుదల చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం రబీలో రైతుబంధు ప్రకటించి రైతుల ఖాతాల్లో నగదును జమ చేసిందని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి టి సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానీ కొంతమంది రైతులకు సుమారు రూ.300 కోట్ల బిల్లులు ట్రెజరీ వద్ద గత 50 రోజులుగా పాస్ చేయకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ బిల్లులు రాని వారిలో రైతుబంధు బాధితులున్నారని పేర్కొన్నారు. ఈ కొద్ది మంది రైతులకు జమ చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్నారని వివరించారు. గతనెల 31వ తేదీ వరకు డబ్బులు ఖాతాల్లో వేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన రైతులకు ఈనెల 15వ తేదీ వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధిత రైతులంతా ఆందోళనకు సిద్ధమవుతారని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మరుపాక అనిల్‌కుమార్

ఆర్ఎస్ఎస్-బిజెపి ఫాసిస్ట్ బ్రాహ్మణీయ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు

- డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో నిరంతరం దళితులపై హింసకు పాల్పడుతున్న ఆర్ఎస్ఎస్-బిజెపి ఫాసిస్ట్ బ్రాహ్మణీయ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరం చేస్తామని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్‌కుమార్ తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రసాదించిన భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి తీసుకరావడానికి బిజెపి, కాషాయ దళాలు కుట్రలు పన్నుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. భారత రాజ్యాంగాన్ని క్రమపద్ధతిలో మోడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మఖ్దూంభవన్‌లో సోమవారం తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం రాష్ట్ర అధ్యక్షులు బందెల నరసయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మరుపాక అనిల్‌కుమార్ మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై దౌర్జన్యాలు, హింస రోజురోజుకు పెరిగిపోతున్నాయని చెప్పారు, సమాన హక్కులు అడుగుతున్న దళితులపై దాడులు చేసి కాషాయ దళాలు చంపేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవించే హక్కులను కాపాడడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అయన విమర్శించారు. దళితులపై దాడులను ప్రతిఘటిస్తూ, రాజకీయ సాధికారత, గుర్తింపు, ఆత్మగౌరవం, హక్కులు కోసం సామూహిక ఉద్యమాలు నిర్మించాలని ఈ సందర్భంగా అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ గౌరవ అధ్యక్షులు కె యేసురత్నం, కార్యనిర్వాహక అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు కె రత్నకుమారి, వై ఉషశ్రీ, సహదేవ్, కె రాజరత్నం, దేవి, పొచన్న, బి లక్ష్మీపతి, కె వెంకటస్వామి, ఆరుట్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు

- దూదిమెట్ల బాలరాజుయాదవ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో రెండో విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ తెలిపారు. మొత్తం 3.5లక్షల యూనిట్ల గొర్రెలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ గొర్రెలు, మేకల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో సంస్థ ఎండీ, ముఖ్య అధికారులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు అన్ని జిల్లాలలోని కలెక్టర్ల అధ్వర్యంలో గొర్రెల పంపిణీని చేపడుతున్నామని వివరించారు. యూనిట్ల రవాణా సరఫరా కోసం టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. 3.5లక్షల యూనిట్లకు కావాల్సిన గొర్రెలను అధికారుల సమావేశంలో గుర్తించామని తెలిపారు. జిల్లా అధికారుల నేతృత్వంలో లబ్ధిదారుల డీడీ చెల్లింపులు, సర్టిఫికెట్ల సేకరణ, లబ్ధిదారుల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాల వారీగా లబ్ధిదారుల సంఖ్య, వారి వివరాలను ఈ-ల్యాబ్ పోర్టల్‌లో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. రూ.6100 కోట్ల నిధుల కేటాయింపుతో రెండో విడుత గొర్రెల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఎండీ రామచంద్రం, డీడీ శ్రీనివాస్‌రావు, ఏడీ వెంకటయ్యగౌడ్, డా.సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సత్కార సభలో వక్తలు

మరుగైపోతున్న కుటుంబ అనుబంధాల దృశ్యం "బలగం"

ప్రజాశక్తి - కల్చరల్

బలగం మరుగై పోతున్న కుటుంబ సంబంధాల దృశ్య రూపం అని బిసి కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభారణం కృష్ణమోహనరావు అన్నారు. శ్రీత్యాగరాయగాన సభలోని కళాసుబ్బారావు కళావేదికపై కళా నిలయం సాంస్కృతిక సంస్థ నిర్వహణలో బలగం చిత్రంలో నటించిన విజయ లక్ష్మి, సురభిలలితలకు సత్కారసభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ కృష్ణ మోహనరావు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ ప్రజల జీవితలను వాస్తవికం గాచూపరని కొని యాడారు. సినీ దర్శక నిర్మాతలు మురళీధర, బద్రినాథ్ దాసరి రమ్య, వసంత రాయలు తదితరులు పాల్గొనగా సురేంద్ర స్వాగతం పలికారు. అధ్యక్షులు పుష్ప వందన సమర్పణ చేసారు.


అచ్చమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తొలి తరం కధకురాలు బండారు అచ్చమాంబ

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి - కల్చరల్.

తెలుగు సాహిత్యంలో కథా ప్రక్రియలలో తొలి తరం రచయిత్రి బండారు అచ్చమాంబ అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపా ధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళావేదికలో శతాబ్ది పూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కథా రచయిత్రి బండారు అచ్చ మాంబ యాదిలో కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ అచ్చమాంబ సాధారణ సంప్రదాయ కుటుంబంలో పుట్టి మధ్య తరగతి జీవితాలను కథ వస్తువులుగా గ్రహించి పలుకథలు రాసారని వివరించారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముక్తేవి భారతి మాట్లాడుతూ అచ్చమాంబ రచనలు పునర్ముద్రణ కావాలని నాటి సాంఘీక ఆర్థిక పరిస్థితులు మహిళల స్థితిగతులు తెలుసు కోవటానికి ఉపయోగ పడతాయని అన్నారు కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ఎస్‌పి భారతి, బండి నాగజ్యోతి, గాన సభ పాలకమండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి రద్దు

- నిరాశతో వెనుతిరిగిన ఫిర్యాదుదారులు
- ముందస్తు సమాచారం లేదంటున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారులకు తమ సమస్యలను, గోడును విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజలకు వరంగల్ కలెక్టరేట్ ప్రజావాణి రద్దయినట్టు తెలియడంతో తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. సంబంధిత అధికారులకు సైతం కలెక్టరేట్‌కు వచ్చిన తర్వాతనే రద్దయిన విషయం తెలుసుకోవాల్సిన పరిస్థితి ఉంది. భగభగమనే మండే ఎండలను సైతం లెక్కచేయకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు, పిల్లలు, మహిళలు, రైతులు.. రాయపర్తి, వర్ధన్నపేట, నర్సంపేట, నల్లబెల్లి, ఖిలావరంగల్ వంటి పలు మండలాల నుంచి కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చారు. తీరా ప్రజావాణి రద్దయినట్టు తెలియడంతో తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు జరగలేదని, కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్లనే ముందస్తు సమాచారం అందటం లేదని పలువురు బహిరంగంగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రజావాణి నిర్వహించడానికి ఆనానుకుల పరిస్థితులు తలెత్తినప్పుడు ముందస్తుగా ప్రజలకు సమాచారాన్ని అందజేస్తే సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రయాసపడాల్సిన అవసరం ఉండదని బాధితులు వాపోతున్నారు. డబ్బులు ఖర్చు అవుతున్నాయే తప్ప ఏండ్ల తరబడి తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణి లేదని ఇక్కడికి అచ్చినంక తెలిసింది : వక్కల రవి, రైతు నల్లబెల్లి

పూర్వికుల నుంచి వారసత్వంగా నాకు వచ్చిన 1.19 ఎకరాల భూమి మీద గతంలో బ్యాంకులో లోన్ తీసుకున్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నేటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా పాసుబుక్కులు ఇచ్చింది. 2021 తర్వాత 1-బి లో ఒక ఎకరం భూమి చూపెడుతుంది. మిగతా 19 గుంటల భూమి 1-బిలో నమోదుకాక కార్యాలయం చుట్టూ తిరగలేకపోతున్నాను. రైతుబంధు ఎకరం భూమికే వస్తుంది. 19 గుంటల భూమికి పడట్లేదని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కావడం లేదు. ముందస్తు సమాచారం ఇస్తే సమయం డబ్బు ఖర్చు అయ్యేది కాదు.

జోజిలా టన్నెల్‌ను పరిశీలించిన గడ్కరీ

- మెఘా సంస్థకు ప్రశంస

హైదరాబాద్ : కాశ్మీర్‌ను కన్యాకుమారితో అనుసంధానం చేయాలనే కలను సాధించడంలో జోజిలా టన్నెల్ కీలకపాత్ర పోశిస్తుందని కేంద్ర రోడ్డు, రవాణ, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. జోజిలా టన్నెల్ నిర్మాణ పనుల పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారని మెఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) ఓ ప్రకటనలో తెలిపింది. జమ్మూ కాశ్మీర్ లెఫ్టనెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయతో కలిసి జోజిలా టన్నెల్‌ను మంత్రి గడ్కరీ పనుల పురోగతిని సోమవారం పరిశీలించారు. ఎంఇఐఎల్ డైరక్టర్ సి. హెచ్ సుబ్బయ్య, జోజిలా ప్రాజెక్ట్ హెడ్ హర్పాల్ సింగ్ వారికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ పనుల పురోగతి గురించి వివరించారు. జోజిలా టన్నెల్ ప్రాజెక్ట్‌ను ఎంఇఐఎల్ నిర్మిస్తోంది. జోజిలా టన్నెల్‌ను సందర్శించిన గడ్కరీ.. టన్నెల్ లోపలికి వెళ్లి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల పురోగతి పట్ల గడ్కరీ సంతృప్తి వ్యక్తం చేశారు. "ఈ ప్రాజెక్ట్ ఇండియాలో భారీ గేమ్ ఛేంజర్ కాబోతుంది. కాశ్మీర్ లోయ, లడఖ్ మధ్య సంవత్సరం పొడవునా కనెక్టివిటీని అందిస్తోంది. అంతేకాకుండా కాశ్మీర్ నుంచి కన్యాకుమారిని అనుసంధానం చేస్తోంది. క్లిష్టమైన వాతవరణ పరిస్థితుల్లో ప్రాజెక్ట్‌లో పనులు కొనసాగిస్తున్న ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు అభినందనలు. టన్నెల్‌లో దాదాపు 38 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్ట్ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తుంది. దీనివల్ల ఉపాధి పెరుగుతుంది. ఇక్కడ రిసార్ట్స్, అడ్వెంచర్ స్పోర్ట్స్ వంటివి నిర్మిస్తూ.. కాశ్మీర్‌ను మరో స్విట్జర్లాండ్‌లా తీర్చిదిద్దుతాం." అని గడ్కరీ తెలిపారు. 2026 నాటికి ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని హర్పాల్ సింగ్ తెలిపారు. కాశ్మీర్ లోయ, లడఖ్ ప్రాంతం మధ్య అన్ని వాతావరణాలకు అనుసంధానంగా ఉండేలా వ్యూహాత్మకంగా జాతీయ రహదారిపై 11,578 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న జోజిలా సొరంగం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రెండేళ్లలో అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.